విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 2,ఆగస్టు 2025

ఇష్టంతో చదివి.. లక్ష్యాన్ని సాధించి..

-కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన యువ కిషోరాలు

విశాలాంధ్ర-రాప్తాడు : తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుపెట్టుకుని భవిష్యత్తు లక్ష్యాన్ని నిర్దేశించుకుని బీటెక్ పూర్తి చేసిన ముగ్గురు యువకులు ప్రభుత్వ కొలువులు సాధించారు. రాప్తాడు గ్రామానికి చెందిన బొగ్గుల రమణమ్మ, రామ్మోహన్ లు కూలి పనులు చేసుకునేవారు. వీరి కుమారుడు దేవేంద్ర ప్రసాద్, వ్యవసాయ పనులు చేసుకునే చిత్రా లక్ష్మయ్య, లక్ష్మీదేవి కుమారుడు చిత్రా రామ్మోహన్, గంగలకుంట గ్రామానికి చెందిన పోలా గోపాల్, ఈశ్వరమ్మల కుమారుడు పోలా రవీంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ముగ్గురు యువకులు ప్రిలిమ్స్ లో క్వాలిఫై అయ్యి ఈవెంట్స్‌లో ప్రతిభ చాటి మెయిన్స్ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు. దేవేంద్ర ప్రసాద్ 2018లో ఏపీఎస్పీ కానిస్టేబుల్, తెలంగాణలో సివిల్ కానిస్టేబుల్ పోస్టు వచ్చినా కూడా ఎస్సై ఉద్యోగమే లక్ష్యంగా చేసుకుని ఆన్లైన్ శిక్షణ తీసుకుని ప్రిపరేషన్ సాగించాడు. చిన్నాన్నలు ప్రభాకర్, రమేష్ ఇద్దరూ పాఠశాలల్లో పీడీలుగా పనిచేస్తుండగా సురేష్ హెూంగార్డుగా పనిచేసేవాడు. అన్న హిమతేజ ఇప్పటికే ఒరిస్సాలో సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరిని ఆదర్శంగా తీసుకున్న దేవేంద్ర కానిస్టేబుల్ ఫలితాల్లో 200 మార్కులకు 143 మార్కులు సాధించి జిల్లాలో 32వ ర్యాంకు సాధించాడు. చిత్రా రామ్మోహన్ 2018 నుంచి ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతూనే ఆన్లైన్ కోచింగ్ తీసుకుని 155 మార్కులు సాధించి జిల్లాలో నాలుగవ ర్యాంకు సాధించాడు. పోలా రవీంద్ర 136 మార్కులతో 95 ర్యాంకు సాధించి సివిల్ కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికయ్యాడు. 2018 నుండి ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగం కోసం కాకినాడ హెచ్ఐపి ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్నాడు. ఎస్కేయూ పరిధిలో అద్దెకు గది తీసుకుని ప్రిపరేషన్ సాగిస్తూనే శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రతి వారం మాక్ టెస్టులు రాసేవాడు. మెయిన్స్ లో ఉద్యోగం సాధించాడు. ముగ్గురు యువకులు భవిష్యత్తులో ఎస్సై ఉద్యోగం సాధించడమే లక్ష్యమన్నారు.

కొట్టారు కొలువులు..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : కానిస్టేబుల్ రాత పరీక్ష ఫలితాల్లో శెట్టూరు మండలం కనుకూరుకు చెందిన చిదానంద 121 మార్కులు సాధించి శభాష్ అనిపించాడు. తండ్రిని కోల్పోయి పేదరికంలో మగ్గుతున్న చిదానంద ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన హెచ్. ప్రదీప్ జిల్లా స్థాయిలో 10వ ర్యాంక్ సాధించి అబ్బురపరిచాడు. చిన్నంపల్లి గ్రామానికి చెందిన బోయ ఈరన్న కుమార్తె నందిని కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి గ్రామస్తుల మన్ననలు పొందారు.

రాప్తాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా రమేష్

19 మందితో కార్యవర్గం ఏర్పాటు

విశాలాంధ్ర-అనంతపురం రూరల్ : రాప్తాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కందుకూరు గ్రామంలో సిపిఐ రాప్తాడు నియోజకవర్గ 6వ మహా మహాసభల నేపథ్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరయ్యారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రామకృష్ణ తెలిపారు. రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శిగా ఎం.రమేష్, సహాయ కార్యదర్శిగా నీళ్ల పాల రామకృష్ణ ఎన్నికయ్యారు. వీరితో పాటు 19 మంది కార్యవర్గ సభ్యులు, 33మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గ కార్యదర్శిగా ఎన్నికైన రమేష్ విద్యార్థి నాయకుడి నుంచి తన ప్రయాణాన్ని మొదలు పెట్టారు. గతంలో విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. అనంతరం సీపీఐలో పలు విభాగాల్లో కీలకంగా పని చేశారు. అనంతపురం రూరల్ మండల కార్యదర్శిగా ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు చేశారు. ముఖ్యంగా ఇళ్ల పట్టాల కోసం ఆయన చేసిన పోరాటాలపై ప్రభుత్వం వైపు నుంచి స్పందన వచ్చింది. తాగునీరు, గ్రామాల్లో మౌళిక వసతుల కల్పన వాటి కోసం పోరాటాలు చేశారు. పార్టీలో క్రమ శిక్షణగా ఉంటూ.. ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటాలను గుర్తించిన పార్టీ నాయకత్వం ఆయన నియోజకవర్గ కార్యదర్శిగా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... పార్టీ నాపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా నిర్వర్తిస్తానన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై తన పోరాటం ఉంటుందని స్పష్టం చేశారు. అన్ని మండలాల్లో నాయకులను సమన్వయం చేసుకుంటూ భవిష్యత్ కార్యచరణ సిద్ధం చేసుకుంటామని స్పష్టం చేశారు. ప్రధానంగా రైతులకు గిట్టుబాటు ధరలు, పంట నష్ట పరిహారం, పేదలకు ఇళ్లు, ఇళ్ల పట్టాలపై పోరాటాలు ఉంటాయని తెలిపారు.

కనేకల్ ఒడియార్ చెరువులోకి తుంగభద్ర జలాలు

వరినాట్లలో రైతులు బిజీబిజీ



విశాలాంధ్ర-కణేకల్లు : కర్ణాటకలోని హొస్పేట్ డ్యాంకు వరద పోటెత్తడంతో తుంగభద్ర జలాలు డ్యాం లోకి రోజు రోజుకు పెరుగుతున్నాయి, దీంతో డ్యాం వద్ద 14 క్రస్ట్ గేట్లను 4 అడుగులు, 12 క్రస్ట్ గేట్లు 3 అడుగులు మేర పైకెత్తి 98,235 క్యూసెక్కుల నదికి, 13,583 వేల క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు మొత్తం కలిపి 1,11,818 క్యూసెక్కులు నీరు బయటికి వదులుతున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు జిల్లాల ప్రజలకు తాగునీరు, సాగునీరందించే ఉమ్మడి ప్రధాన జలాశయమైన తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతుండటంతో ఆ మూడు రాష్ట్రాలకు చెందిన ఆయకట్టు రైతులు సకాలంలో పంటలను సాగు చేసుకునేందుకు ఉత్సాహంగా నాట్లు వేసుకుంటున్నారు. గత ఏడాది 13వ నంబరు క్రస్ట్ గేటు కొట్టుకుపోగా, అనంతరం తాత్కాలికంగా మరమ్మతులు చేసి స్టాప్లగ్ గేటును అమర్చిన సంగతి తెలిసిందే. అయితే గేట్లు బలహీనంగా ఉన్న నేపథ్యంలో అన్ని క్రస్టను పూర్తిగా మార్చాలని నిపుణులు సూచించినందున తుంగభద్ర డ్యాంలో గరిష్ట నీటి నిల్వను 100 టీఎంసీల నుంచి 80 టీఎంసీలకు కుదించి వరద నీటిని నదికి వదులుతున్నారు. దీంతో నదిలోకి భారీ స్థాయిలో నీరు చేరుతోంది. డ్యాంలో ప్రస్తుతం 77 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంచుకుని, మిగిలిన నీటిని నదికి వదిలారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ 1633 అడుగులకు గాను 1624.62 అడుగులకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 82,874 క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో 1,11,818 క్యూసెక్కులుగా ఉంది. మొత్తం నీటి సామర్థ్యం 105,788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 75.260 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 1631,88 అడుగుల వద్ద 100,520 టీఎంసీల నీరు నిల్వతో, 1,03,676 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో 1,17,571 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉండేదని తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు. అలాగే శుక్రవారం రాత్రి బొమ్మనల్ దాటుకుని కనేకల్ వడియార్ చెరువులోకి తుంగభద్ర జలాలు 1800- క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతోందని హెచ్.ఎల్.సి అధికారి దివాకర్ రెడ్డి తెలిపారు.

సజావుగా పింఛన్లు పంపిణీ చేయాలి...

ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

విశాలాంధ్ర-అనంతపురం : ఎన్టీఆర్ భరోసా పథకం కింద సజావుగా పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం నగరంలోని నవోదయ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను ఇంచార్జి జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. లబ్ధిదారుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తెలపాలని, ప్రభుత్వం నుంచి ఏదైనా సహాయం అవసరమైతే చేస్తామని తెలిపారు. ముందుగా కే.ఉమాదేవి అనే లబ్ధిదారురాలికి రూ.4 వేల రూపాయల వీడో పెన్షన్‌ను అందించారు. అనంతరం గురుశాంతప్ప అనే లబ్ధిదారుడికి 4 వేల రూపాయల వృద్ధాప్య పెన్షన్‌ను అందజేశారు. ఇంటి వద్దకే వచ్చి పెన్షన్లను అందజేయడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద అత్యంత ప్రతిష్టాత్మకంగా పెన్షన్ల పంపిణీ చేపట్టడం జరుగుతోందని, లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను అందజేయాలని అధికారులను, సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ పావని, తహసిల్దార్ హరికుమార్, స్థానిక నాయకులు బుగ్గయ్యచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

బీటీపీ కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలి

▸ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : పాలకుల నిర్లక్ష్యం వల్లే భైరవాణి తిప్ప ఆయకట్టు బీడుగా మారిందని, ప్రజా ప్రతినిధులు పదేపదే ప్రారంభోత్సవం చేసి ప్రజలను మభ్యపెట్టడం తగదని నిధులు తీసుకొచ్చి పనులు పూర్తి చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రహ్మసముద్రం మండలం వంక తండాలో సిపిఐ మండల మహాసభలో కార్యదర్శి నాగరాజు నాయక్ పతాకావిష్కరణ చేయగా, అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో గోపాల్ మాట్లాడుతూ కళ్యాణదుర్గం కన్నేపల్లి రోడ్డు కోసం నిరాహార దీక్షలు చేసిన వేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. మండలంలో రోడ్ల దుస్థితి అధ్వాన్నంగా ఉన్నదని తొలి అడుగులో ప్రజా ప్రతినిధులు, అధికారులకు కనిపించలేదా అన్నారు. కర్ణాటక వేదావతి నదిపై వాణి విలస్ ప్రాజెక్ట్ నిర్మించి అధిక నీటిని వాడుకోవడం వల్ల బిటిపి నిర్వీర్యంగా మారిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా తప్పుల తడకగా మారిందని, సరిచేసి రైతులందరికీ న్యాయం చేయాలని అన్నారు. అనంతరం మండలంలోని పలు సమస్యలపై తీర్మానం చేసి, సిపిఐ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సిపిఐ సహాయ కార్యదర్శి నరసింహులు, ప్రకాష్, అనిల్ ఈరన్న, కర్రెన్న, రామలింగ శివశంకర్ ప్రభు నాయక్, బి.నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక.. మండల కార్యదర్శిగా నాగరాజు నాయక్, సహాయ కార్యదర్శిగా రాంబాబు, 9 మంది కార్యవర్గ సభ్యులుగా 17 మంది కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా అనుకున్నారు.

కళ్యాణదుర్గం ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన కళ్యాణదుర్గం ఇంచార్జ్ రిజిస్ట్రార్ నారాయణస్వామిని సస్పెండ్ చేశారు. ఈమేరకు డిఐజి విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. గత వారంలో అనంతపురంలోని రామ్‌నగర్ కాకతీయ అపార్ట్మెంట్ వద్ద నాగేంద్రనాయక్ అనే వ్యక్తి నుంచి రూ.5 లక్షల లంచం తీసుకుంటూ నారాయణస్వామి దొరికిపోయిన విషయం తెలిసిందే. ఆయన్ను కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరుపరచి రిమాండుకు పంపిం చారు. అనంతరం నారాయణస్వామి సస్పెండ్ చేశారు. సత్యసాయి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న మురళికృష్ణకు కళ్యాణదుర్గం ఇన్చార్జి రిజిస్ట్రార్‌గా తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించారు.

3న జిల్లా యోగాసన పోటీలు

విశాలాంధ్ర-ఉరవకొండ: జిల్లా యోగాసన ఛాంపియన్షిప్ పోటీలు ఈనెల 3న ఆదివారం ఉరవకొండలోని జిల్లా పరిషత్ సెంట్రల్ స్కూల్లో నిర్వహించుచున్నామని అసోసియేషన్ చీఫ్ రవికాంత్ రమణ మరియు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ10 సంవత్సరాల నుండి 55 సంవత్సరంలో లోపల ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పోటీల్లో పాల్గొనుటకు అర్హులన్నారు. విజేతలు రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా యోగాసనా పోటీల్లో పాల్గొనుటకు అర్హులన్నారు. మరిన్ని వివరములకు 963028694, 9440288899లో సంప్రదించాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధిపై పోరాటానికి సిద్ధం కావాలి

▸ సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పి.రామకృష్ణ

విశాలాంధ్ర-రాప్తాడు : నియోజకవర్గ అభివృద్ధి కోసం త్వరలో సీపీఐ పోరుబాటకు శ్రీకారం చుడుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పి రామకృష్ణ అన్నారు. శుక్రవారం రాప్తాడులో సీపీఐ మండల కార్యదర్శి రవీంద్ర ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామంలో నియోజకవర్గ మహాసభను ఘనంగా నిర్వహించామని, మూడేళ్ళ నుంచి చేసిన కార్యక్రమాలను గురించి చర్చించడంతో పీఏబీఆర్ ద్వారా చెరువులకు నీటి కోసం ఉద్యమం, హంద్రీనీవా, పీఏబీఆర్ ఆయకట్టు ఏర్పాటు చేసి పిల్ల కాలవల ద్వారా పొలాలకు నీరు, నియోజకవర్గంలో టమోటా, చీని, మామిడి, అరటి పంటలు అధికంగా పండిస్తున్న రైతులు ఉన్నందున ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు, రాప్తాడు మండల కేంద్రంలో మార్కెట్ యార్డు నిర్మాణాలపై పోరాటం, ఇల్లు లేని నిరుపేదల కోసం ఇంటి స్థలాలు, పట్టాలు, పక్కా గృహాలు నిర్మాణానికై పోరాటం కోసం తీర్మానం చేశామన్నారు. రాప్తాడు నియో జకవర్గ కేంద్రంలో జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ఉద్యమించాలని అన్నారు.

రాప్తాడు నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నిక... రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శిగా ఎం.రమేష్ సహాయకార్యదర్శిగా నీళ్లపాల రామకృష్ణ, కార్యవర్గం 19, కౌన్సిల్ 33 మందిని ఎన్నుకున్నామన్నారు. రాప్తాడు మండల కార్యదర్శిగా ఆర్.రవీంద్ర, సహాయ కార్యదర్శిగా ఎం.చలపతి అనంతపురం రూరల్ మండల కార్యదర్శిగా నరేష్, సహాయ కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ ఆత్మకూరు మండల కార్యదర్శిగా బండారు శివను ఎన్నుకున్నారు.

న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించిన మహిళ

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని సుంకులమ్మ పాలెంకు చెందిన దాసరి స్వర్ణలత తనకు న్యాయం చేయాలని శుక్రవారం రోడ్డుపై బైఠాయించారు. మీడియా ముఖంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని రాగి తోట పాలెం, రెండో వార్డుకు చెందిన బడవాండ్ల శాంతయ్య అతని కుమారులు బి. ప్రతాప బి. విజయ్‌కుమార్ 01/07/2022 సంవత్సరంలో రెండో వార్డ్ లో ఉన్న హరిజనవాడ (మాలగేరి) వీధిలో ఉన్న ఇంటి నెంబర్: 2/325 నెంబర్ గల ఇంటిని తనకు రూ.35 లక్షలకు విక్రయించారని చెప్పారు. ఇండ్లు విక్రయం అయిన వెంటనే ఇల్లు విడచాలని బడవాండ్ల శాంతయ్యను కోరగా మాకు మూడు సంవత్సరాలు సమయం ఇవ్వండి బాడుగ ఇస్తామని చెప్పారన్నారు. మూడేళ్ల తర్వాత ఇళ్లు ఖాళీ చేయాలని కోరినా మొండికేస్తున్నారని పోలీసులు న్యాయం చేయాలని, తనకు న్యాయం జరిగేంత వరకు తాను విక్రయం చేసిన ఇంటి దగ్గర నుంచి కదిలేది లేదని బాధితురాలు తెలియజేశారు.

ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవం

విశాలాంధ్ర-అనంతపురం : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా అనంతపురం సర్వజన ఆసుపత్రి చిన్నపిల్లల విభాగం సమావేశ భవనంలో ప్రారంభోత్సవ కార్యక్రమం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహర్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబిదేవి, సర్వజన ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైద్య కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్, డిఐఓ డాక్టర్ యుగంధర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి తల్లి కాన్పు అయిన గంటలోపు ముర్రు పాలు తన బిడ్డకు తాగించాలని.. దీనివల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగిఎటువంటి అంటువ్యాధులు రాకుండా తోడ్పడుతాయని, బిడ్డ అన్ని దశల్లోనూ మానసికంగా, ఆరోగ్య ఎదుగుదల ఉంటుందని తెలియజేశారు, పుట్టినది మొదలు ఆరు నెలలు పాటు కేవలం తల్లిపాలే తాగించాలన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగం అధికారి డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీనివాసులు, గైనకాలజీ విభాగం అధికారి డాక్టర్ సుచిత్ర, డీపీహెచ్ ఎన్ఓ ప్రమీలాదేవి, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనా అధికారి గంగాధర్, వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ డీఎస్‌వీ రాజు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు

విశాలాంధ్ర-రాప్తాడు : మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తామని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి అన్నారు. రాప్తాడు గ్రామ పంచాయతీలో కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా వితంతువు పెన్షన్లను ఇంటి ఇంటికి వెళ్ళి పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, టీడీపీ కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శీనా, సర్పంచ్ సాకే తిరుపాలు, మరూరు సొసైటీ ఛైర్మన్ గోనుగుంట్ల గోపాల్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గంగులకుంట కృష్ణ, పాల్గొన్నారు..

అన్నదాత సుఖీభవను ఒకే విడతలో చెల్లించాలి..

విశాలాంధ్ర-కూడేరు : అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు అందించే రూ.20వేల రూపాయలను ఒకే విడుదల రైతులకు అందజేయాలని. అఖిలభారత రైతు సంఘం జిల్లా కోశాధికారి ఈ.రాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం కూడేరులోని రైతు కూలీ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే. ఒకే విడతలో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి ఆమాటను. పెడ చెవిన పెట్టిందన్నారు. వాటిని ఒకే సారి రైతులకు అందిస్తే ఎరువులు క్రిమి సంహారక మందులు కొనుగోలు చేయడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కూడేరు కడదర కుంట అరవకూరు ముద్దలాపురం రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన సరుకులు, కోడిగుడ్లు ఇవ్వాలి

విశాలాంధ్ర-గుంతకల్లు : ప్రభుత్వ స్కూళ్లకు, అంగన్వాడి సెంటర్లకు మంచి పౌష్టికఆహారం, కోడిగుడ్లు అందించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వి.వెంకటేష్ కోరారు. పట్టణంలో ప్రభుత్వ స్కూల్లో, అంగన్వాడీ సెంటర్లను శుక్రవారం పరిశీలించారు. కాంట్రాక్ట్ ఇచ్చే ఒక గుడ్డు 50 గ్రాముల పైగా ఉండాలి.. కానీ 30 గ్రాములు ఉన్న గుడ్లను సప్లై చేస్తున్నారని అన్నారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ హైస్కూల్‌లలో ఒక్క రోజుకు 300 గుడ్లు పడేస్తున్నారని, నాణ్యతలేని సరుకులు, గుడ్లు అందిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలి

విశాలాంధ్ర-శింగనమల: మండల పరిధిలోని తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరియు అన్ని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తరిమెల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ తరిమెల విలేజ్ హెల్త్ క్లినిక్‌లో బాలింతలకు గర్భిణీలకు తల్లి పాల ప్రాముఖ్యత గురుంచి వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే మొదటి 6 నెలలు తల్లి పాలు తప్ప ఇతర పాలు ఇవ్వరాదన్నారు. పీహెచ్ఎన్, గ్రేస్ లలితమ్మ, సూపర్వైసర్ నాగమ్మ, ఏఎన్ఎం మెహతాజ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ

విశాలాంధ్ర-ఉరవకొండ: గంబూషియా చేపలతో దోమల ద్వారా డెంగ్యూను అరికట్టడం సాధ్యమని మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి తెలిపారు. ఎంపీడీవో రవి ప్రసాద్‌తో కలిసి శుక్రవారం ఉరవకొండ పట్టణంలో నిల్వ ఉన్న వర్షపు నీటిలోనూ, మురుగు నీటిలో 30 వేల గంబూషియా చేపలు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంబూషియా చేపలు దోమల లార్వాలను తినేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాల్లో మురుగు నిల్వ లేకుండా చూడాలన్నారు. సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేయడం ద్వారా దోమ కాటు నుంచి రక్షణ పొందవచ్చన్నారు. తద్వారా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు రావన్నారు. ఈ కార్యక్రమంలో యుఆర్డీ సతీష్ కుమార్, మెడికల్ ఆఫీసర్ వినిత పాల్గొన్నారు.

ఇంటింటికీ ఫీవర్ సర్వే తనిఖీ..

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పరమేశ్వర్, సాయి సుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే తనిఖీ చేసి కాలనీలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే తప్పక పాటించాలని, తొట్లలోని లార్వాను తొలగించి, కాలువలలో అబేట్ స్ప్రే చేశారు. అనంతరం ప్రజలకు పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్, ఏఎన్ఎం విజయ, మేరీ, హెల్త్ అసిస్టెంట్ శరత్, ఆశా కార్యకర్తలు సులోచన, సుబ్బలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యం

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని కోటవీధిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వైసిపి మండల సీనియర్ నాయకులు బాల రమేష్ బాబు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులతో కలిసి శుక్రవారం కూటమి ప్రభుత్వ హామీల అమలులో వైఫల్యంపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా బాల రమేష్ బాబు' వైసీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు అనేక హామీలు ఇచ్చి..తీరా అధికారం లోకి వచ్చాక మోసం చేశారని మండిపడ్డారు . ఈ కార్యక్రమంలో శేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, కర్ణాకర్, చాంద్ బాషా, నాగేంద్ర సోమశేఖర్ శ్రీనివాసులు భార్గవ్ పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం..

విశాలాంధ్ర-తాడిపత్రి : పట్టణంలోని గన్నేవారిపల్లె కాలనీలో శుక్రవారం అంగన్వాడి టీచర్ల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కాలనీ లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ తల్లులు పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల రాబోవు రోజుల్లో తల్లులకు రొమ్ము క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు, బిడ్డలు అనారోగ్య పాలు కాకుండా పరిరక్షించవచ్చు అన్నారు. తల్లిపాలలో బిడ్డకు ఉపయోగపడే వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సావిత్రి, అలివేలమ్మ, సునీత, అనసూయ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం..

విశాలాంధ్ర-గుంతకల్లు : లక్ష్మీ నారాయణ స్వామి రాతి దేవాలయం సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు తిరునామం ఆకారంలో నిర్మాణం జరగడం అద్భుతమని పట్టణానికి చెందిన ఆర్టీసీ ఇన్చార్జి కంట్రోలర్ మురళీకృష్ణ కృష్ణవేణి దంపతులు కొనియాడారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయాన్ని వారు కుటుంబ సమేతంగా దర్శించుకున్నామన్నారు. దేవాలయ సన్నిధిలో జరిగే నిత్య అన్న ప్రసాద వితరణకు వారి వంతుగా రూ.5116ను దేవాలయ సహ వ్యవస్థాపకులు తలారి తేజకు అందజేశారు. కవి రత్న దాదన చిన్నయ్య స్మారకార్థం విరాళాన్ని అందజేశామన్నారు. మురళీకృష్ణ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

కనేకల్ ట్రైనీ ఎస్ఐగా నారాయణరెడ్డి

విశాలాంధ్ర-కణేకల్లు : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ట్రైనింగ్ ఎస్సైగా నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లాకు చెందిన నారాయణరెడ్డి 2024-25 బ్యాచ్ కి చెందిన ట్రైనింగ్ ఎస్సైగా ఐదు నెలల పాటు కనేకల్ పోలీస్ స్టేషన్లో శిక్షణ పొందనున్నారు, ఎస్పీ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే విధానం, ప్రజలతో వ్యవహరించే తీరు, కేసులు నమోదు, దర్యాప్తు తదితర అంశాలపై శిక్షణ తీసుకుంటారని ఎస్సై నాగమధు తెలిపారు.

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

విశాలాంధ్ర-జెఎన్టియుఏ: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరిల 25, ఈడబ్ల్యుఎస్ 3లో 28 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు మంగళవారం ఉదయం 11-30 గంటలకు నిర్వహించబడుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి. జయచంద్రరెడ్డి తెలిపారు. దరఖాస్తులు సోమవారం వరకు స్వీకరిస్తామన్నారు. స్పాట్ అడ్మిషన్‌లో చేరిన విద్యార్థిని, విద్యార్థులు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లకు అర్హులు కారన్నారు. స్పాట్ అడ్మిషన్స్ రోజున అన్ని ఒరిజినల్ తీసుకు రావాలని సూచించారు. జిల్లాలోని కళ్యాణదుర్గం, నార్పల, తాడిపత్రి, రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లులోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు.

రేపు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం అమలు

విశాలాంధ్ర-బెలుగుప్ప : మండలంలోని 8262 మంది రైతు కుటుంబాలకు సంవత్సరానికి రూ.20 వేలు చొప్పున మూడో విడతల్లో జమ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి పృథ్వీ సాగర్ తెలిపారు. మొదటి విడత రూ.7వేలు, రెండవ విడత రూ.7 వేలు మూడో విడత రూ.6 వేలు జమ చేయడం జరుగుతుంది. మొదటి విడతగా 5,78,34000 బెలుగుప్ప మండలానికి విడుదల అవుతుందన్నారు. బెలుగుప్ప మండలంలో ఇంకా 245 మంది రైతుల బ్యాంకు ఖాతాలు ఎన్‌పిసిఐ ఇనాక్టివ్‌లో ఉన్నవి. ఈ బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేసి తరువాత డ్రా చేసిన యెడల బ్యాంకు ఖాతాలు యాక్టివ్ అవుతాయని... 45 మంది ఆధార్ సీడింగ్ కాలేదని, అట్టి రైతులు సంబంధిత బ్యాంకులో గానీ పోస్టాఫీసులో ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. 293 మంది రైతుల వివరాలురైతు సేవా కేంద్రాల్లో పొందవచ్చని తెలిపారు.

విద్యా హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి

విశాలాంధ్ర-రాయదుర్గం : విద్యా హక్కు చట్టాన్ని జిల్లాలోని అన్ని ప్రవేటు పాఠశాలలో అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ బి.వెంకటరమణ బాబు కలెక్టరు వినోద్ కుమార్‌కు లేఖ ద్వారా విన్నవించారు. ఈ చట్టం ప్రకారం ప్రవేటు, కార్పొరేట్ పాఠశాలలో 1వ తరగతిలో 25 సీట్లను పేద కుటుంబాలకు చెందిన బాలలకు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి అనాథ బాలలకు తదితర వర్గంవారికి కేటాయించాల్సి ఉందన్నారు. ఈ విధంగా చేర్చుకున్న బాలురకు పట్టణ ప్రాంతాలలో 8,000 గ్రామీణ ప్రాంతాలలో రూ.6500 చొప్పున ప్రభుత్వమే రుసుము చెల్లించేలా ఈ చట్టం నిర్ధారించిందన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని సీహెచ్ఓ నాగమణి అన్నారు. మండలంలోని ఉద్దేహాల్ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం తల్లి పాల వారోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.. ఈ సందర్భంగా సీహెచ్ఐ నాగమణి తల్లిపాలు శిశువుకు అత్యంత శ్రేయస్కరమని తెలిపారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జానకి, ఆశా కార్యకర్తలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 2,ఆగస్టు 2025

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ..

ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

విశాలాంధ్ర-కదిరి : ప్రతి నెల 1న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు గౌరవం చూపించే విధంగా వారి చెంతకే పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పథకం కింద కొత్తగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నల్లచెరువులో బసవన్నకట్ట వీధిలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి పెన్షన్లు అందజేశారు. ప్రతి లబ్ధిదారుతో వారి సమస్యలు, జీవన పరిస్థితులపై ఆరా తీశారు. పెన్షన్‌లు కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాక, ప్రభుత్వ శ్రద్ధకు, మానవీయ సంబంధానికి గుర్తు అని పేర్కొన్నారు. సమాజంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు గౌరవం చూపించే విధంగా వారి చెంతకు మేము స్వయంగా వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే ఊరుకోం

కలెక్టర్ టి.ఎస్.చేతన్

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి: లింగ నిష్పత్తిలో అసమానతలను తొలగించి.. సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ టి.ఎస్.చేతన్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ టి.ఎస్.చేతన్ అధ్యక్షత న పిసిపిఎన్డిటీ (గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిర్మూలన) పై..జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ... బాలల లింగ నిష్పతిని గమనిస్తే.. బాలురతో పోలిస్తే బాలికల శాతం చాలా తక్కువగా ఉందన్నారు. ఈ అసమానతను తొలగించి.. సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచాలన్నారు. స్కానింగ్ సెంటర్లలోను, ఆస్పత్రుల్లోనూ లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు చేయడం, ఆడ పిల్ల వద్దంటూ.. కుటుంబంలో ఎవరైనా వేధింపులకు గురి చేస్తుంటే పూర్తి ఆధారాలతో తెలియచేయాలన్నారు. తనిఖీలు చేసి లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి.. కఠిన శిక్షను అమలు చేయాలన్నారు. అందుకోసం ప్రజల్లో విస్తృత ప్రచారం, అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా.. అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శిలకు ప్రధాన భాగస్వామ్యం కల్పించాలన్నారు. అలాగే, పిసిపిఎన్డిటీ చట్టం ప్రకారం ప్రతి స్కాన్ సెంటర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని, ప్రతి స్కానింగ్‌కు సంబంధించి పూర్తి డాక్యుమెంటేషన్ ఉండాలని అన్నారు.

సమగ్ర సంక్షేమమే లక్ష్యం

మంత్రి సత్య కుమార్ యాదవ్

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని 7వ వార్డులో కార్యక్రమాలలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పలు సంక్షేమ , అభివృద్ధి చర్యలకు శ్రీకారం చుట్టారు. ముందుగా, ఎన్టీఆర్ భరోసా పథకం కింద ధర్మవరం నియోజక వర్గంలో 633 మందికి కొత్త స్పౌజ్ పెన్షన్లు మంజూరవ్వగా, అందులో ధర్మవరం పట్టణానికి చెందిన 217 మంది లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి, పెన్షన్లు అందజేశారు. ప్రతి లబ్ధిదారుతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలు, జీవన పరిస్థితులు తెలుసుకున్నారు. పెన్షన్‌లు కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాక, ప్రభుత్వ శ్రద్ధకు, మానవీయ సంబంధానికి గుర్తు అని పేర్కొన్నారు. పట్టణంలోని 7వ వార్డులో రూ.60 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, పైప్లైన్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. శానిటేషన్ లోపాలు, కనెక్టివిటీ సమస్యలు పరిష్కరి స్తామన్నారు. అక్రమ వడ్డీ వసూళ్ల పేరుతో బాధితులను వేధిస్తే, వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధు సూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మార్కెట్ యార్డు చైర్పర్సన్ అంబటి అరుణ శ్రీ, ఈ.ఈ. సాయి కృష్ణ, డీఈ ప్రభుదాస్, డీఈ వీరేష్, టి.పి.ఆర్.ఓ విజయ్ భాస్కర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబిలేష్, పట్టణ అధ్యక్షులు జింక చంద్ర, పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సొంతం

జిల్లాలో మొదటి స్థానంలో రాఘవేంద్రారెడ్డి

విశాలాంధ్ర-చిలమత్తూరు : ఆంధ్రప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో మండలంలోని లాల్లేపల్లి గ్రామానికి చెందిన జి.రాధమ్మ, జి.జయ చంద్రారెడ్డి, దంపతుల కుమారుడు రాఘవేంద్రారెడ్డి 159 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. ఆ యువకుడుని గ్రామస్తులు మండల ప్రజలు అభినందించారు. ఎంపికైన అభ్యర్థులకు సెప్టెంబర్ 1 నుంచి శిక్షణ ఇస్తామని హోం మంత్రి అనిత వెల్లడించారు.

జిల్లాలో ఐదవ స్థానంలో మోహన్‌కుమార్

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండకు చెందిన బోయ సిద్ధరాజ్, శాంతమ్మ దంపతుల తనయుడు మోహన్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ ఫలితాల్లో సత్తా చాటాడు. అమ్మానాన్నలకు, ఆ కుటుంబానికి అతనే ఆసరా. పెనుకొండ లక్కీ కంప్యూటర్స్ టుటోరియల్స్‌లో ట్యూషన్ చెప్పుకుంటు తన భవితను నమ్ముకున్నాడు. జిల్లాలో 154 మార్కులు సాధించి, జిల్లాలో 5వ స్థానంలో నిలిచాడు.

రైతుల ఆత్మహత్యలపై పరిశోధనకు డాక్టరేట్..

విశాలాంధ్ర-కదిరి/టౌన్ : ఉమ్మడి జిల్లాలోని రైతుల ఆత్మ హత్యలపై ప్రత్యేక పరిశోధనపై చేసిన మారక రాజ్యలక్ష్మికి డాక్టరేట్ పొందారు. కదిరి రూరల్ పరిధిలోని చిప్పలమడుగు గ్రామం చెందిన మారక రాజులక్ష్మి శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర విభాగంలో (ఎకనామిక్స్ డిపార్ట్మెంట్) ప్రొఫెసర్ జి. వెంకట్ నాయుడు ఆధ్వర్యంలో ఫార్మర్స్ సూసైడ్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ విత్ స్పెషల్ రెఫెరెంటీస్ టూ సూసైడ్ అఫ్ గ్రౌండ్ డేట్ ఫార్మర్స్ పరిశోధనలో భాగంగా ఈ డాక్టరేట్ వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పాల్గొని అనేక పరిశోధన పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. రాజ్యలక్ష్మికి డాక్టరేట్ రావడంతో పలువురు ఆచార్యులు, నాన్ టీచింగ్ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

అంబేద్కర్ కాలనీ బోర్డు తొలగింపుపై ధర్నా

విశాలాంధ్ర-పెనుకొండ : మండల పరిధిలోని కురువాండ్లపల్లి గ్రామపంచాయతీలో 4 సంవత్సరాల క్రితం అధికారికంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ కాలనీ బోర్డ్‌ను అక్రమంగా తొలగించారని విషయం తెలుసుకున్న బహుజన చైతన్య వేదిక కురువ వండ్లపల్లి గ్రామాన్ని సందర్శించి ధర్నా చేపట్టారు. సర్పంచ్ పర్యవేక్షణలో తొలగించినారు అనే విషయం తెలుసుకొని ఆయన్ను వివరణ అడగ్గా తీవ్రమైన ఒత్తిడి కారణంగా తొలగించామని చెప్పడంతో మండిపడ్డారు. సర్పంచ్ తీరుకు నిరసనగా బోర్డును తొలగించినవారిని వెంటనే అరెస్ట్ చేయాలని హరిపురం వద్ద నేషనల్ హైవేపై బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో వందలాది మందితో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శివరామ కృష్ణ మాట్లాడుతూ కుల అహంకారంతో అంబేద్కర్ బోర్డు తొలగించినారని భారతరత్న అంబేద్కర్ అంటే కేవలం మాల మాదిగలకు సంబంధించిన వ్యక్తి కాదని ఈ దేశ ప్రజల కోసం ఈ దేశంలో సామాజిక న్యాయం కోసం సమాన హక్కుల కోసం తన జీవితాన్నిధారపోసిన గొప్ప త్యాగ పురుషుడన్నారు. ఆ మహనీయుని అవమానించడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమ నందు బాబు ప్రసాద్, మరియు బహుజన చైతన్య వేదిక బృందం కురుబ వాండ్లపల్లి స్థానికులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-గోరంట్ల : మండలంలోని కొత్తబయన్నపల్లి గ్రామంలో కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశాల మేరకు.. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ప్రోగ్రామ్ నిర్వహించారు. 7వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి గర్భవతులు బాలింతలు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగరాణి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాపించాలని, బిడ్డకు 6 నెలలు నిండేవరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని దీనివలన బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా వుంటుందని, తల్లి పాలు బిడ్డకు బ్యాలెన్స్ డైట్ అని, బిడ్డకు కావలసిన అన్ని పోషకాలు తల్లిపాలలో ఉంటాయని .. పోతపాలు తాగించడం బిడ్డకు ప్రమాదకరమని తెలిపారు. తల్లి బిడ్డకు పాలివ్వడం వలన తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. గ్రామంలోని జన్మించి 7 రోజులు అయిన బిడ్డ ఇంటి వద్ద ఆ తల్లితో మొక్క నాటించారు. అలాగే గర్భిణులు, బాలింతల గృహ సందర్శించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శాంతమ్మ, ప్రభావతి, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

వీర జవాన్ సేవలు మరువలేనివి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

విశాలాంధ్ర-గోరంట్ల : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన వీర జవాన్ మురళి నాయక్ కుటుంబాన్ని గురువారం రాత్రి పరామర్శించారు. వారి ఇంటికి వెళ్లి మురళినాయక్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు .దేశానికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేవని అన్నారు. అనంతరం మాధవ్‌ను గోరంట్ల మండల అధ్యక్షులు బోయ లక్ష్మి నారాయణ మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించి వారికి వినాయకుడి చిత్రపటాన్ని జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షులు మిట్ట వంశీకృష్ణ, గోరంట్ల మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రెటరీ హరికృష్ణ, సునీల్ వైట్ల, పుట్టపర్తి రామంజి, పూల గంగాధర్, శంకర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, భజంత్రీ శంకర, జయరాం నాయక్, పుట్టపర్తి మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ హేమేందర్, వెంకటాచలం, హరీష్, మహిళా నాయకురాలు రామంజమ్మ, ముంతాజ్ అమ్మ, లక్ష్మి, పార్వతి బాయ్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని గాడిదలతో ఊరేగింపు

విశాలాంధ్ర - అగళి : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తి అవుతున్న వర్షాలు కురువకపోవడం తో శుక్రవారం నందరాజన పల్లి గ్రామానికి చెందిన ప్రజలు గాడిదతో అగళిలో ఊరేగింపు చేపట్టారు. ప్రతి సంవత్సరం జూలై నెల కంతా వేలాది హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేసేవారు.. ఈ ఏడు వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆశతో వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. ఈ క్రమంలో బంకమట్టితో వరుణుడి బొమ్మను తయారుచేసి తలపైపెట్టుకొని ఊరేగింపు కార్యక్రమాన్ని చేస్తే వర్షాలు కురుస్తాయని ప్రజల విశ్వాసం. వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రార్థించారు.

5న జర్నలిస్టులు డిమాండ్స్ డేగా పాటిద్దాం

అక్రిడేషన్లు పొడిగింపు వద్దు...కొత్త కార్డులు ఇవ్వాల్సిందే

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్య సాయి: ఈనెల 5వ తేదీ మంగళవారం జర్నలిస్టులు డిమాండ్స్ డేగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) పిలుపునిచ్చింది. ఈ మేరకు శ్రీసత్యసాయి జిల్లాతో పాటు రెవెన్యూ డివిజనల్ కేంద్రాలు, మండల కేంద్రాలలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులంతా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని శ్రీసత్యసాయి జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. 5వ తేదీన జరిగే జర్నలిస్టుల డిమాండ్స్ డే ను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు సి.పుల్లయ్య, కార్యదర్శి డి.బాబు, ఉపాధ్యక్షులు డాక్టర్. ఎస్.జయనందనరెడ్డి ఐజేయూ సభ్యులు ఎ.శ్రీనివాసులు, ట్రెజరర్ రాము, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు హరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, జివి నారాయణ ప్రకాష్ కె.మురళి లు పిలుపునిచ్చారు. ఇప్పటికే అనేకసార్లు పొడిగిస్తూ వచ్చిన అక్రిడిటేషన్లు ఇక పొడిగించవద్దని, తక్షణమే కొత్తకార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని జర్నలిస్టులు వారి వారి ప్రాంతాలలో ఈనెల 5వ తేదీ మంగళవారం ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేయా లని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రిడిటేషన్ల పొడిగింపును అంగీకరించేది లేదని అన్నారు. ప్రభుత్వం దృష్టికి మనసమస్య వెళ్లేలా జర్నలిస్టుల సంఘటిత శక్తిని నిరూపించాలని అన్నారు.

ప్రధాన డిమాండ్లు.... తక్షణమే నూతన అక్రిడేషన్లు మంజూరు చేయాలి, వర్కింగ్ జర్నలిస్టులకు స్థలాలతోపాటు గృహ నిర్మాణాలను చేపట్టాలి, ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న పెన్షన్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలి, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పథకాన్ని పునరుద్ధరించాలి, 50 శాతం రాయితీతో రైల్వే పాసును పునరుద్ధరించాలి, జర్నలిస్టులపై అక్రమ కేసులను రద్దు చేయాలి, దాడుల నివారణ కమిటీ వేయాలని కోరారు.

గర్భిణీలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి..

విశాలాంధ్ర-ధర్మవరం: గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల శ్రద్ధను వహించాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ తల్లం నారాయణ మూర్తి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని దుర్గా నగర్ లో గల అర్బన్ హెల్త్ సెంటర్లో 30 మంది గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియా మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ప్రశాంతమైన చిత్తం కలిగి, వైద్య పరీక్షలు సకాలంలో చేయించుకోవాలని, బిడ్డ బిడ్డకు కనీసం మూడు సంవత్సరాల దూరం పాటించాలని తెలిపారు. ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి కీర్తిశేషులు కనగానపల్లి శ్రీనివాసులు పుట్టినరోజు సందర్భంగా వారి జ్ఞాపకార్థం కుమార్తె డాక్టర్ హిమబిందు ఆర్థిక సహాయం అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జగ్గా వేణుగోపాల్, కార్యదర్శి కోనాపురం సాయి ప్రసాద్, ఉపాధ్యక్షులు మంజునాథ్ సంయుక్త కార్యదర్శి తాడిమర్రి రామకృష్ణ కోశాధికారి చల్లా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కబడ్డీలో గొట్లూరు జట్టు ద్వితీయ స్థానం

విశాలాంధ్ర-ధర్మవరం : స్థానిక ఆడిటింగ్ స్టేడియంలో ఆర్డీటీ సంస్థ ధర్మవరం వారు జూలై 15వ తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలు ఫైనాన్స్‌లో కొత్తపేట మున్సిపల్ హై స్కూల్ వర్సెస్ జడ్పీహెచ్ఎస్ గొట్లూరు మధ్య జరిగిన పోటీలలో గొట్లూరు జట్టు రణరత్ ద్వితీయ స్థానంలో నిలిచిందని హెడ్మాస్టర్ జగన్నాథం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెడ్మాస్టర్ తో పాటు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రమేష్ బాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పాఠశాల కమిటీ, తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు

అన్ని దానాల కన్నా రక్తదానం గొప్ప

విశాలాంధ్ర-ధర్మవరం: అన్ని దానాల కన్నా రక్తదానం గొప్ప అని కరస్పాండెంట్ చాంద్ బాషా ప్రిన్సిపాల్ ఫణి కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని యాదవ వీధిలో శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని యువర్స్ ఫౌండేషన్, చౌడేశ్వరి ట్రస్ట్, శ్రీ సాయి డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంతోమందికి అవసరమైనప్పుడు రక్తాన్ని దానం చేసే అవకాశం ఏర్పడడం పుణ్యకార్యమని తెలిపారు. అదేవిధంగా రక్తదాన ఆవశక్తి గూర్చి కూడా వారు వివరించారు. శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. అనంతరం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు పోలా ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల పాలిట సేవే రోటరీ క్లబ్ లక్ష్యం

విశాలాంధ్ర-ధర్మవరం: పేదల పాలిట సేవే రోటరీ క్లబ్ లక్ష్యము అని రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగభూషణ, కార్యదర్శి విజయభాస్కర్ కోశాధికారి నరేందర్ రెడ్డి క్యాంపు చైర్మన్ జయశ్రీ తెలిపారు. 10వ తేదీ ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా) పేద ప్రజలకు ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సాంస్కృతిక మండలిలో ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. శిబిరానికి దాతలుగా కీర్తిశేషులు దాసరి కేశమ్మ, కీర్తిశేషులు దాసరి పెద్ద వెంకటేశులు జ్ఞాపకార్థం వీరి కోడలు కుమారుడు దాసరి రమాదేవి దాసరి వెంకటేశులు (చిట్టి) వారి కుటుంబ సభ్యులు వ్యవహరిస్తారని వెల్లడించారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-ధర్మవరం : క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సును పట్టణంలోని రుషి విద్యాలయాలు నిర్వహించామని ప్రిన్సిపాల్ కరణ్ స్వరూప సింగ్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ధూమపానం ప్రమాదకరమని, వాహనాల నుండి వెలువడే విషపూరిత రసాయన పొగలు పీల్చడం వలన శ్వాస సమస్యలు వస్తాయని తెలిపారు. బయటికి వెళ్లినప్పుడు తప్పనిసరిగా మాస్క్ గాని చేత గుడ్డ గాని ధరించాలని తెలిపారు. అదేవిధంగా సిగరెట్లు, బీడీలు తాగేవారికి దూరంగా ఉండాలని తెలిపారు. మొక్కలు పెంచాలని తెలిపారు. పాఠశాల డీన్ భాస్కర్ రెడ్డి, సీఈవో రవీంద్ర పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక అలంకారం

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని సాల్య వీధిలో గల పెద్దమ్మ తల్లి ఆలయంలో అర్చకులు వెంకటేష్ శర్మ వేపాకుతో ప్రత్యేక అలంకరణ గావించారు. తొలుత అమ్మవారికి పంచామృతాలతో పాటు విశేష మంగళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తాదుల పేరిట అర్చనలు, పూజలు నిర్వహించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమం బుగ్గ వంశస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తూ, అలంకరణ జాతర శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గుడిబండ ఎంఈఓగా ప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-గుడిబండ: మండల విద్యాశాఖ అధికారిగా ప్రసాద్ రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు ఎంఆర్ సి, సిఆర్ పి,పిటిఐలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో మంచి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

రూ.2 లక్షల చెక్కు పంపిణీ..

విశాలాంధ్ర-లేపాక్షి : నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన లక్ష్మీనారాయణ కుటుంబానికి పిఎం జెజెబివై కింద రూ.2 లక్షలు చెక్కును అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం మండల పరిధిలోని బిశలమానింపల్లె గ్రామానికి చెందిన జయలక్ష్మికి బిజెపి నాయకులు పీఎం జెజెబివై బృందం కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బిజెపి మండల అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వారి ఖాతాలోకి జమ చేయడం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశంలో పేదరిక నిర్మూలన చేయాలనే ఆలోచనతో అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు ఛాలెంజ్ రాముడు గిరింద్ర ఆనందప్ప చంద్రశేఖర్ సిరివరం మూర్తి. జిల్లా కార్యవర్గ సభ్యులు వినయ్ కుమార్. సాయి కుమార్ గౌడ పాల్గొన్నారు.

అనధికార వ్యక్తులకు కేజీబీవీలోకి ప్రవేశం లేదు

విశాలాంధ్ర-నంబులపూలకుంట: స్థానిక కేజీబీవీ పాఠశాల ఆవరణం లోనికి పాఠశాల సిబ్బంది, ఎస్ఎంసి కమిటీ సభ్యులు తప్ప ఇతరులు ఎవరికి అనుమతి ఇవ్వకూడదని రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుండి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని ఎస్‌ఓ రిహాన తెలిపారు. పాఠశాలకు బహుమతులు, విరాళాలు ఇవ్వడానికి కూడా ప్రవేశం నిషేధించబడినదని తెలిపారు. దాతలు విద్య బోధనలకు అంతరాయం కలిగించరాదన్నారు.

బాధితుడిని పరామర్శించిన రాష్ట్ర కార్యదర్శి

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని ఎస్. రాయపురం గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త డీలర్ భూతరాజు గత కొన్ని రోజుల క్రితం ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు అతను ప్రథమ చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి భూతురాజును ఇంటికి వెళ్లి పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంద అతనికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కొంకల్లు డాక్టర్ కృష్ణమూర్తి, స్థానిక టిడిపి నాయకులు రామతామన్న, నాగేంద్రప్ప, సీనా హనుమంతా మాఫిర్ సాబ్, ఫీల్డ్ అసిస్టెంట్ నటరాజు, తదితరులు పాల్గొన్నారు.

మరకుంటపల్లిలో నీటి కష్టాలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండల పరిధిలోని మరకుంటపల్లి గ్రామంలో తలమర్ల రోడ్డుకు చెందిన ప్రజలు, గత పది రోజులుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు కొత్తచెరువు రోడ్డుకు పైపులైన్లు వేసి నీటి సరఫరా ప్రారంభించారు. తలమర్ల రోడ్డుకు ఉన్న ఇళ్లకు తమ ప్రాంతానికి నీరు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి ఇటీవల కొత్తచెరువు ప్రధాన రోడ్డుకు మాత్రమే పైప్‌లైన్ వేసి నీటి సరఫరా ప్రారంభించారు. అయితే తలమర్ల రోడ్డు వైపు ఉన్న ఇళ్లకు నీటి కనెక్షన్ ఇప్పటికీ ఇవ్వలేదు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్‌కి ఫోన్ ద్వారా తెలియజేసినప్పటికీ, సర్పంచ్‌కి చెప్పడం జరిగింది. పది రోజుల నుంచి పైప్లైన్ వేపిస్తాను అని అంటున్నారు కానీ పని మాత్రం చేయడం లేదని కాలనీవాసులు తెలిపారు. పక్క కాలనీకు నీళ్లు వస్తున్నా, మాకు మాత్రం రావడం లేదని వెంటనే అధికారులు సమస్యలు పరిష్కరించి తాగునీటి కష్టాలు తీర్చాలని కోరారు.

సోలార్ లైట్ల ఏర్పాటుకు స్థల పరిశీలన

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ ఎమ్మెల్యే ,రాష్ట్ర మంత్రి ఎస్.సవితమ్మ ఆదేశాల మేరకు శుక్రవారం పెనుకొండ పట్టణంలో 14 వ వార్డ్ 15 వ వార్డ్ మరియు 16వ వార్డ్ లో సోలార్ లైట్లు కోసం స్థల పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్న నగర పంచాయతీ సిబ్బంది సోలార్ కంపెనీ ఎంప్లాయిస్ 15వ వార్డ్ ఇంచార్జ్ బాబుల్ రెడ్డి,16వ వార్డ్ ఇంచార్జ్ త్రివేంద్ర,14వ వార్డ్ ఇంచార్జ్ సమి,తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు.

జిల్లా స్థాయి జూడో సెలక్షన్స్

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి: ఈనెల 3వ తేదీ ఉదయం 9 గంటలకు చిగిచెర్ల జడ్పీహెచ్ హై స్కూల్ ఆవరణలోగల స్టేడియంలో జరిగే జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ జూడో సెలక్షన్స్ కు జిల్లాలో గల జూడో క్రీడాకారులందరూ హాజరై తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని సెక్రటరీ భాస్కర నాయుడు తెలియజేశారు. అక్కడ సెలెక్ట్ అయిన క్రీడాకారులు మంగళగిరి సమీపంలో గల ఎం సి బి మెమొరియల్ ట్రస్ట్ లో ఈనెల తొమ్మిది, పదవ తారీకులలో జరిగే స్టేట్ ఛాంపియన్షిప్ కి సెలెక్ట్ అవుతారు. కనుక జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు ఆధార్ కార్డ్, స్టడీ సర్టిఫికెట్, జూడో గీతోసహా హాజరుకావాలని జిల్లా జనరల్ సెక్రెటరీ డాక్టర్ భాస్కర్ నాయుడు తెలియజేశారు.

డిజైనర్ నాగరాజుకు సన్మానం

విశాలాంధ్ర-ధర్మవరం: మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూర్యనారాయణ సూచన మేరకు కూటమి నేతలు చేనేత డిజైన్ డవలెప్మెంట్ జాతీయ అవార్డు గ్రహీత ప్రముఖ డిజైనర్ జుజ్జూరు నాగరాజును వారి స్వగృహంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చరవాణి (ఫోన్) ద్వారా వరదాపురం సూర్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు. తోరలోనే ధర్మవరం వచ్చి వ్యక్తిగతంగా సన్మానం చేస్తాను అని, మీలాంటి వారు ధర్మవరానికే కాదు దేశనికి గర్వకారణం అని వరదాపురం సూరి పేర్కొన్నారు. దాదాపు 200 సంవత్సరాల క్రితం లేపాక్షి లత మండపం నుండి ప్రారంభమైన ధర్మవరం చేనేత పట్టు చీరలు డిజైన్ ను నూతన వరవడిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకోని రావడానికి నాగరాజు కృషిచేయడం అభినందనీయం అని, భవిష్యత్ లో మహిళల అభిరుచి అనుగుణంగా మరిన్ని నూతన డిజైన్లు రూపొందించి అంతర్జాతీయ స్థాయిలో ధర్మవరం చేనేత పట్టు చీరలకు గుర్తింపు తీసుకుని రావాలని వారు నాగరాజును కోరారు. అందుకు అవసరం అయినా సహాయ సహకారాలు అందిస్తాను అని సూరి హామీ ఇచ్చారు. నాగరాజును అభినందించిన వారిలో తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కోశాధికారి అంజన రెడ్డి, తెలుగు మహిళ మాజీ రాష్ట్ర కార్యదర్శి సాహెబి, టీడీపీ 2 వార్డు మాజీ ఇంచార్జి బోడిగల గిరిధర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి .నారాయణ స్వామి యాదవ్, బీజేపీ మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాప్తటి రాము, బీజేపీ 6 వార్డు మాజీ ఇంచార్జి చింత జగదీష్, గందమనేని నారాయణ స్వామి, భారతీయ జనత పార్టీ, తెలుగుదేశం సీనియర్ నాయకులు గోపాల కృష్ణ, రంగనాయకులు, శీన, మాబు, పోతుకుంట మధు ఉన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శనివారం 02, ఆగస్టు 2025

తల్లిపాలు ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలం అమిద్యాల గ్రామంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు వైద్య ఆరోగ్యశాఖ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హెల్త్ సూపర్వైజర్ శేఖర్ తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లిపాలు పిల్లలకు శ్రీరామరక్ష అని ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆరు నెలల తర్వాత అదనపు పోషకాహారం ఇవ్వాలని సూచించారు. తల్లిపాలలో అన్ని రకాల పోషకాలు ఉంటాయని అన్ని వేళలా అందుబాటులో ఉంటాయని ఆయన సూచించారు. అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాబు షూరిటీ మోసం గ్యారంటీ

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైసిపి జిల్లా బిసి ప్రధాన కార్యదర్శి తలారి నాగేష్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులతో కలిసి శుక్రవారం కూటమి ప్రభుత్వ పాలన వైఫల్యాలపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. హనుమంత రెడ్డి రషీద్, ఉపేంద్ర గౌడ్, రంగనాథ్, భాష ,జిలాన్ వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవానికి రైతులందరూ హాజరు కావాలి

విశాలాంధ్ర-శింగనమల: అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవ కార్యక్రమం రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లా దర్శి లో ప్రారంభిస్తున్న నేపథ్యంలో రైతులందరూ హాజరుకావాలని మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు, ఈ సందర్భంగా ఏవో అన్వేష్ కుమార్ మాట్లాడుతూ శింగనమల మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం లోని సమావేశ మందిరంలోశింగనమలనియోజకవర్గ సదస్సు శనివారం ఉదయం 10 గంటలకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని, కావున మండలవ్యాప్తంగా రైతులు,ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులందరూ తప్పక హాజరుకావాలాని మండల వ్యవసాయ అధికారి అన్వేష్ కుమార్ కోరారు.

నూతన పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర-కూడేరు : కూడేరు పంచాయతీ ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ నూతనంగా 14 మందికి పంపిణీ చేశారు. భర్తకు పింఛను వస్తుండగా ఆయన మరణిస్తే భార్యకు ఆ పింఛన్ మంజూరవుతుంది. ఇలాంటివి కూడేరు గ్రామంలో 14మందికి పింఛను మంజూరైంది. ఈ పింఛన్ తీసుకున్న మహిళలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూడేరు టీడీపీ నాయకులు, బాటవెం కటేష్, జయప్రకాష్ గౌడ్, విజయభాస్కర్ గౌడ్, బొమ్మయ్య, నారాయణస్వామి పాల్గొని పింఛన్ ఇచ్చారు.

నిత్య అన్నదానానికి విరాళం

విశాలాంధ్ర-గుంతకల్లు: లక్ష్మీ నారాయణ స్వామి రాతి దేవాలయం సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు తిరునామం ఆకారంలో నిర్మాణం జరగడం అద్భుతమని పట్టణానికి చెందిన ఆర్టీసీ ఇన్చార్జి కంట్రోలర్ మురళీకృష్ణ కృష్ణవేణి దంపతులు కొనియాడారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక లక్ష్మీనారాయణ స్వామి గుడిలో వారు మాట్లాడుతూ శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయాన్ని వారు కుటుంబ సమేతంగా దర్శించుకున్నామన్నారు. వారు దేవాలయ సన్నిధిలో జరిగే నిత్య అన్న ప్రసాద వితరణకు వారి వంతుగా రూ. 5116 ను దేవాలయ సహ వ్యవస్థాపకులు తలారి తేజకు అందజేశారు. కవి రత్న దాదన చిన్నయ్య స్మారకార్థం విరాళాన్ని అందజేశామన్నారు. మురళీకృష్ణ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. అర్చకులు కేశవ వారికి ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి సుధాకర్ ఓంశాంతి ప్రసాద్ మల్లికార్జున స్వామి, మురళి, శివ ,వర్ధన్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలోని ఐదు సచివాలయల పరిధిలో శుక్రవారం అధికారులు టిడిపి పార్టీ నాయకులు ఎన్టీఆర్ భరోసా పథకం కింద మంజూరైన పింఛన్లను వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పంపిణీ చేశారు. అంతే కాకుండా పట్టణంలో38 స్పౌజ్ పింఛన్లను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి పార్టీ సీనియర్ నాయకులు ప్యారం కేశవానంద, మాజీ ఎంపీటీసీ సభ్యులు సుంకన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే ఎక్కడ లేని విధంగా ఆంధ్రప్రదేశ్లో పింఛన్లను పంపిణీ చేస్తుందన్నారు. పింఛన్ల యొక్క నగదును కుటుంబ పోషణకు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు పోడియం వితరణ

విశాలాంధ్ర-తాడిపత్రి: మండలంలోని పెద్ద పడమల గ్రామంలో ఉన్న హై స్కూల్‌కు శుక్రవారం పోడియం వితరణ చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైస్కూల్లో ఏవైనా కార్యక్రమాలు జరిగినప్పుడు పోడియం లేక వచ్చిన అతిథులు కార్యక్రమం ఉద్దేశించి ప్రసంగించాలంటే ఇబ్బందు లు పడుతున్నారని హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమకు సమాచారం తెలిపారు. దీంతో తమ వంతు సహాయంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోడియం వితరణ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రమేష్ నాథ్ రెడ్డి, రాజా నాయుడు, నారాయణస్వామి, నాగేశ్వర్ రెడ్డి, అనురాధ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అన్నదాత సుఖీభవ రైతుల ఖాతాలో జమ

విశాలాంధ్ర-కూడేరు: అన్నదాత సుఖీభవ,పీఎం కిసాన్ మొత్తం రూపాయలు కలిపి 7000 రూపాయలు రైతుల ఖాతాలో శనివారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంవిడుదల చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శుభకర్ విలేకరుల సమావేశంలో తెలియజేశారు. అన్నదాత సుఖీభవ ఒక్కొక్క రైతుకు 5000, ప్రధానమంత్రి కిసాన్ 2000 రూపాయలు కలిపి మొత్తం 7000 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందిఅని అన్నారు. ఇందులో భాగంగా కూడేరు మండల వ్యాప్తంగా 9,454 మంది రైతులకు గాను అన్నదాత సుఖీభవ కింద 4.73 కోట్ల రూపాయలు, అలాగేపీ ఎం కిసాన్ కింద 1.89 కోట్ల రూపాయలు కలిపి మొత్తం 6.62 కోట్ల రూపాయలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులు ప్రత్యక్ష ప్రసారం వీక్షించడం కొరకు ఆయా గ్రామ పంచాయితీ సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని.కావున మండలంలోని ప్రతి రైతు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించి లబ్ధి పొందగలరని ఆయన రైతులకు సూచించారు.

ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్ పంపిణీ

విశాలాంధ్ర - అగళి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్ పంపిణీలను శుక్రవారం జడ్పీటీసీ ఉమేష్ ఎంపీపీ రేణుక కామరాజు, జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు రమేష్ సర్పంచ్ నరసింహమూర్తి, మాజీ ఎంపీటీసీ మల్లికా పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం మండలానికి కొత్తగా 122 మంది వితంతువులకు కొత్తగా పెన్షన్ మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం వృద్ధుల, వికలాంగులు, ఒంటరి మహిళల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. మండలంలోని కోడిపల్లి పంచాయతీలో పింఛన్ పంపిణీ చేశారు.

చెట్లు పక్కన రోడ్డు మధ్యలో విద్యుత్ స్థంబాలు

విశాలాంధ్ర - నల్లమాడ : ప్రతి గ్రామానికి త్రిఫేస్ విద్యుత్ సరఫరా ఉండాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఆర్డీఎస్ పథకం ద్వారా త్రిఫేస్ విద్యుత్ తీగలు మండల వ్యాప్తంగా నిర్వహించారు. నిబంధనల ప్రకారం రోడ్డుకు నాలుగు మీటర్లు దూరంలో స్థంభాలను ఏర్పాటు చేయాల్సివుంది. విద్యుత్ కాంట్రాక్టులు నిబంధనలు ప్రకారం కాకుండా వారి ఇష్టాను సారంగా రోడ్డు పక్కన చెట్లు మధ్యలో స్థంబాలను పాదుతున్నారు. ప్రభుత్వం ఇంటింటా ముంగిట చెట్లును నాటి పర్యావరనాన్ని కాపాడాలని అధికారులు, పాలకులు చెప్పినా వాటిని పట్టించుకోకుండా 20,30 అడుగులు ఎత్తులో వున్న పచ్చని చెట్లను అడ్డంగా నరుకుతున్నారని ఆయా గ్రామ ప్రజలు, ద్విచక్ర వాహనాల చోదకులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నల్లమాడ, నల్లశింగయ్య గారిపల్లి, రాగానిపల్లి, రెడ్డి పల్లి, దొన్నికోట,పులగం పల్లి,యర్రవంకపల్లి,మీసాలపల్లి తదితర గ్రామాలలో పనులు చేపట్టారు. చెట్లు విద్యుత్ స్థంబాలు ,రెండు ఒకే ప్రదేశంలో వున్నప్పుడు కొన్ని సమస్యలు తలెత్తుతాయి. చెట్లు విద్యుత్ తీగలను తాకినప్పుడు మంటలను రేకెత్తించే అవకాశం ఉంది. అధికారులు, అటవీ శాఖ అధికారులకు ఇవన్నీ తెలిసినా చూడనీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో విద్యుత్ తీగలు తెగి ప్రమాదం జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. రోడ్డు,చెట్లు పక్కన విద్యుత్ స్థంబాలు,తీగలు లాగడం ప్రమాదకరం వుంటుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు,చెట్లు పక్కన స్థంబాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు,ప్రయానికులు కోరారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అత్యవసరం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణాన్ని పచ్చదనంతో నింపుతూ, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించాలనే దృఢ సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గాంధీనగర్, కాలేజ్ సర్కిల్ ప్రాంతాల్లో పర్యావరణ అనురక్త కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, పట్టణ సౌందర్యం, మరియు ప్రజా ఆరోగ్య సాధనకు శ్రీకారం చుట్టేలా ఈ కార్యక్రమాలు జరిగాయి. మొదట నూతనంగా గాంధీనగర్‌లో ఏర్పాటుచేసిన పార్కులో మొక్కల నాటే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, నేటి చెట్టు రేపటి శ్వాస అన్న నినాదంతో ప్రజలను మొక్కల పెంపకంలో చురుకుగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటం, గాలి నాణ్యతను మెరుగుపరచడం, పట్టణ సౌందర్యాన్ని పెంపొందించడం ద్వారా ధర్మవరం ప్రజలకు ఆరోగ్యంగా జీవించే వాతావరణం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. విశ్రాంతి, ఆరోగ్య పరిరక్షణ మరియు సామాజిక కలయికకు అనువుగా రూపొందించిన ఈ హరిత ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్‌లు, మొక్కల పెంపకానికి ప్రత్యేక జోన్లు, నీడతో కూడిన సీటింగ్ ఏర్పాట్లు, అన్ని వయసులవారికి అనువైన పౌర సదుపాయాలు ఏర్పాటు చేయబడ్డాయి అని తెలిపారు. ఈ పార్క్ ప్రజలకు ప్రాణవాయువు సాఫల్యాన్ని, ఆరోగ్యంగా జీవించే అవకాశాన్ని అందించడమే కాక, హరిత ధర్మవరం వైపు ముందడుగుగా నిలుస్తుందని తెలిపారు. అంతే కాదు, పట్టణ సుందరీకరణకు మరో ముఖ్యమైన అడుగుగా, కాలేజ్ సర్కిల్ వద్ద నిర్మించిన మన ధర్మవరం గార్డెన్ ను మంత్రి అధికారికంగా ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, పట్టణ అభివృద్ధి, ప్రజల ఆరోగ్య ప్రయోజనం ఈ మూడు లక్ష్యాలను ఏకకాలంలో సాధించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. మొక్కలు నాటడం అనేది కేవలం కార్యక్రమం కాదు అది భవిష్యత్ తరాల కోసం మన బాధ్యత అని మంత్రి తన సందేశాన్ని ముగించారు. ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, బిజెపి పట్టణ అధ్యక్షులు జింక చంద్ర, రూరల్ అధ్యక్షులు చంద్ర, టిడిపి పట్టణ అధ్యక్షులు పరిసె సుధాకర్, మహేష్ చౌదరి, ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ : కౌన్సిలర్

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణంలో నీ 32వ వార్డులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుమ్మనూరు నారాయణస్వామి ఆదేశాల మేరకు మున్సిపల్ కౌన్సిలర్ వై. సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం పింఛన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే అందజేసిన 4000రూపాయలతో పాటుగా మిఠాయి స్వీట్ బాక్స్ కూడా పంపిణీ చేయడం జరిగిందినీ అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-గుత్తి: మునిసిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రవి కిరణ్‌ను మేనేజర్‌గా పదోన్నతిపై మండపేట మునిసిపాలిటీ కు బదిలీపై వెళ్లిన సందర్భంగా శుక్రవారం గుత్తి మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుత్తి మున్సిపల్ కార్యాలయంలో ఆయన చేసిన సేవలను కార్యాలయ అధికారులు సిబ్బంది కొనియాడారు. మున్సిపాలిటీ సిబ్బంది, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని అభినందనలు తెలిపారు.

నూతన స్పౌజ్ పింఛన్లు పెన్షన్ పంపిణీ

విశాలాంధ్ర - పామిడి : పామిడి మండల పరిధిలోని పి.కొండాపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు సచివాలయ సిబ్బంది శుక్రవారం పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన నూతన 5 స్పౌజ్ పెన్షన్‌లు, టీడీపీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఇవాళ ఇంటింటికీ తిరుగుతూ అర్హులైన వారికి పంపిణీ చేశారు. నూతన 4వేల రూపాయలు స్పౌజ్ పింఛన్లు పెన్షన్ తీసుకున్న వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండ్ల రాజు, వలిపి రామాంజనేయులు, భాస్కర్, మారెన్న రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఫలితాలలో యాడికి వాసి ప్రతిభ

విశాలాంధ్ర-యాడికి: యాడికి మండల కేంద్రంలోని చిన్నవేపమాను వీధి కి చెందిన నేతి బొట్టు రంగప్ప, నేతి బొట్టు లీలావతిల కుమారుడు నేతి బొట్టు శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ విభాగానికి ఎన్నికయ్యారు. నేతిబొట్టు శ్రీనివాస్ గత ఎనిమిది సంవత్సరాల నుండి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ స్థానిక విజన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ పోటీ పరీక్షలు రాశారు. కానిస్టేబుల్ ఫలితాలలో ఓపెన్ విభాగంలో ఆయన ఎన్నిక కావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, విజన్ స్కూల్ విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్ విజన్ ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

నూతన పింఛన్లు అందజేత..

విశాలాంధ్ర-కణేకల్లు: రాయదుర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని రాంనగర్ కొత్తకోటలోని టీడీపీ కార్యకర్తలు వారి వారి ఇళ్ళ దగ్గరికు వెళ్లి నూతనంగా మంజూరైన వితంతువు పింఛన్‌కి అర్హులు అయిన వారికి స్వయంగా వెళ్లి కార్యకర్తలే పింఛన్ అందించారు. మండలంలోని అన్ని గ్రామంలో కూడా ఎన్టీఆర్ పెన్షన్ బరోసా పథకం కింద నూతనంగా మంజూరు అయినా వితంతు పింఛన్ నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ పంపిణీ

విశాలాంధ్ర-గుత్తి: గుంతకల్ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, జిల్లా తెదేపా పార్లమెంటు అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, తెదేపా గుంతకల్ నియోజకవర్గం యువ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్.. గుత్తి పట్టణంలో 17, 18 వ వార్డులలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు స్వయంగా పంపిణి చేసి, అక్కడే సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో అనంతపురము జిల్లా పార్టీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గుమ్మనూరు ఈశ్వర్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రతి లబ్ధిదారుల ఇంటింటికి పెన్షన్లు పంపిణీ చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా అమలుచేసిన పథకాలు, అభివృద్ధి, తదితర వివరాలను స్వయంగా వెంకటశివుడు యాదవ్ ప్రజలకు వివరించారు. తెదేపా నాయకులు మాట్లాడుతూ పేదరికం లేని సమాజమే కుటమి ప్రభుత్వ లక్ష్యమని, సంపద సృష్టించి, పేదలకు పంచుతామని పేర్కొన్నారు. గుత్తి మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియాబీ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలుబీ క్లస్టర్ యూనిట్,బూత్ ఇంచార్జిలుబీ కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల పనితీరు, అభివృద్ధి మెరుగుపరచాలి

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి : జిల్లాలోని అన్ని ఆసుపత్రుల పనితీరు, అభివృద్ధి, నాణ్యతను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ క్వాలిటీ అస్సూరెన్స్ కమిటీ మీటింగ్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆసుపత్రుల పనితీరు, వాటిని ఎలా అభివృద్ధి చేయాలని అందరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యత పరిమాణాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలని వారి వారి అభిప్రాయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జాతీయ నాణ్యత పరిమాణాలను అభివృద్ధి కొరకు చేయవలసిన పనులను, కన్స్ట్రక్షన్ లోని ఆస్పత్రుల పరిమితిని వాటికి కావలసిన స్థితిగతులను చర్చించి తగు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గోడ పత్రాన్ని కలెక్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫిరోజా బేగం, డి సి హెచ్ ఎస్, అవార్డులు పొందిన డాక్టర్లు, ఎమ్మెల్ హెచ్ పీ లు, ఏఎన్ఎంలు, హాస్పటల్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీ చేసిన ఇంచార్జ్ ఎంపీడీవో

విశాలాంధ్ర-గుడిబండ: మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా స్పౌస్ పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని తెదేపా నాయకులతో కలిసి ఇంచార్జ్ ఎంపీడీవో నాగరాజు నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గతంలో చనిపోయిన పింఛన్దారుల పింఛన్లను ప్రభుత్వం ఉత్తర్వుల వరకు చనిపోయిన వ్యక్తి భార్యకు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. స్థానిక ఎంపీటీసీ వనజ శశిధర్, తెదేపా జిల్లా లింగాయత్ సమితి అధ్యక్షుడు దుర్గేష్, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ సచివాలయ సిబ్బంది పింఛన్ అందుకున్న మహిళలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-రొళ్ల: మండలంలోని బి.జి.హళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు యంజారప్ప, ఉపాధ్యాయుని యులు రాజ్యలక్ష్మి నాగనందం,వాణి శకుంతలమ్మ,లను ప్రధానో పాధ్యాయులు వసంతప్ప ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానిం చారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధికి,విద్యార్థుల విద్యాభివృద్ధికి అన్ని విధాలుగా తోడ్పాటు అందించి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వసంతప్ప, ఉపాధ్యాయులు రూబీయా నాజ్,వేణుగౌడు గ్రామ ప్రజలు,విద్యార్థులు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజనం ఏజెన్సీనలను సన్మానించారు.

మండలంలో స్పౌజ్ పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల వ్యాప్తంగా కొత్తగా మంజూరైన స్పౌజ్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలో, అర్హులైన పెన్షన్ దారులకు స్వయంగా పింఛన్ అందజేసిన టీడీపి. కన్వీనర్ ఎగువింటి శ్రీనివాస్ జనసేన కన్వీనర్ చిన్న ప్రవీణ్, ఈ సందర్భంగా కూటమి టీడీపి జనసేన కన్వీనర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీలో ఏపీ ప్రభుత్వం ఒక పండుగలా నిర్వహిస్తుందని భర్త చనిపోతే వెంటనే భార్యకు పింఛన్ అందించేలా చర్యలు చేపట్టిందని గతంలో 6నెలలకు ఒకసారి కొత్త పింఛన్లు మంజూరు చేసేవారని కానీ ఇప్పుడు కొత్తగా పెన్షన్ మంజూరు విధానంలో కీలక మార్పులు తీసుకువచ్చి లబ్ధిదారులకు వెంటనే పెన్షన్ అందేలా చేస్తున్నామని అంకితభావం, నిబద్ధత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సొంతమని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు గౌరి శంకర్, లక్ష్మీనారాయణ యాదవ్, మంజు, చంద్ర, నాగేంద్ర, వేణు, ఆటో రామంజి, జగదీష్, నారాయణస్వామి, అధికారులు సచివాలయ ఉద్యోగులు, పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి

విశాలాంధ్ర-గుడిబండ: మండల పరిధిలోని ఎస్.రాయాపురం, ముత్తుకూరు, ఎస్ఎస్ గుండ్లు గ్రామాలలో నూతనంగా మంజూరైన పింఛన్లను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా పింఛన్లును రూ.4 వేలు రూపాయలు అందించి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు అండగా నిలిచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు లక్ష్మీనరసప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, డాక్టర్ కృష్ణమూర్తి, షబ్బీర్, నాగేంద్రప్ప,జయన్న తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తి చేస్తాం..

విశాలాంధ్ర-అనంతపురం: రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. శుక్రవారం రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ల ఏర్పాటుపై రాష్ట్రంలోని గుంటూరు, వైజాక్, రాజమండ్రి, ఎన్టీఆర్, అనంతపురం, తిరుపతి జిల్లాల జాయింట్ కలెక్టర్లతో విజయవాడ నుంచి ఐటి సెక్రటరీ భాస్కర్ కాటమనేని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతపురం నగరంలోని ఇంచార్జి జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం నగరంలోని జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్ లో ఏర్పాటు చేస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ లో అవసరమైన పోస్టుల నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ గురించి పరిశ్రమలు, విద్యాసంస్థలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, డిఈ వి.రాజగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, ఆర్.అండ్.బి జెఈ బాల కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర-రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా స్పౌస్ క్రింద 141 మందికి కొత్తగా పెన్షన్ విడుదల అయినట్లు తెలిపారు.కూటమి ప్రభుత్వం వృద్ధుల,వికలాంగులు, ఒంటరి మహిళల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు.హులీకుంట పంచాయితీ గిడ్డబొమ్మనహళ్ళి వన్నారనహళ్ళి, బి.జీహళ్లి అగ్రహారం,జి.జి హట్టి,హొట్టెబెట్టా తదితర గ్రామాలలో పెన్షన్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈఓఆర్డి శ్రీనాథ్ పరమేష్ వీఆర్వోలు,సచివాలయ ఉద్యోగులు,మార్కెట్ యార్డ్ చైర్మన్ బి.ఎస్ గురుమూర్తి రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ సాధికార సమితి కన్వీనర్ వి.యం పాండురంగప్ప సింగల్ విండో అధ్యక్షులు దాసరెడ్డి,టిడిపి మండల కన్వీనర్ జి.కె ఈరన్న తెదేపా మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్,కోఆర్డినేటర్ రామకృష్ణ,క్లస్టర్ ఇంచార్జ్ భరత్,పంచాయతీ అధ్యక్షులు నాగేంద్ర రవికుమార్ యువ నాయకులు యోగానంద్ బాలకృష్ణ మంజునాథ్ వివిధ పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-గుడిబండ: మండల కేంద్రంలోని అంగనవాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించినట్లు ఐసిడి సూపర్వైజర్ కమలమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు పిల్లల ఆరోగ్యానికి ఎదుగుదలకు ఎంత అవసరమో అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పూర్తిస్థాయిలో ఆగస్టు ఒకటి నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రతి గ్రామంలోని అంగనవాడి కేంద్రాలలో నిర్వహించాలని అంగనవాడి టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ సేవలో గర్భిణీలకు అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ: పెను కొండ ప్రభుత్వ హాస్పిటల్ కు వైద్య చికిత్సల కొరకు వచ్చినటువంటి గర్భిణీ స్త్రీలకు వారి సహాయకులకు ఇతరత్రా అనారోగ్యంతో వచ్చినవారికి, ఆరోగ్య కార్యకర్తలక , నారాయణ సేవ చేయాలని సంకల్పముతో, నారాయణ సేవలో భాగంగా సుమారు150 మందికి అన్నదానం , వాటర్ ప్యాకెట్లు అందజేసి నారు. ఈ కార్యక్రమానికి కోనాపురం ఈశ్వరయ్య, వారి గీతావాణి దంపతులు సహకరించి, వారి కుటుంబ సభ్యులు తొ సేవలో పాల్గొని, సేవలు అందించినారు. , వీరి కుటుంబ సభ్యులకు, సేవలో పాల్గొన్న వారందరికీ భగవాన్ బాబా వారి యొక్క అనుగ్రహ ఆశీస్సులతో ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగాలని కోరుకుంటున్నా మనీ సత్యసాయి తాలూకా సేవా సమితి అధ్యక్షులు శంకర్ తెలిపారు.

నూతన మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మండల విద్యాశాఖ అధికారి 1 గా రాఘవయ్య శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు, ఆయనకు మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది ఉపాధ్యాయులు ఆయనకు స్వాగతం పలుకుతూ ఆయనకు పూల బొకేలు శాలువాలతో సన్మానం చేసి బాధ్యతల స్వీకరించినందున శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేశారు.